సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
మంగళవారం,23 జూలై 2024


## పోలవరం ప్రాజెక్టు పూర్తికి నిధులు మంజూరు చేయండి

**- జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను కలిసిన కేంద్ర మంత్రులు, మంత్రి నిమ్మల,ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



**న్యూఢిల్లీ/ఏలూరు,సూర్యబ్యూరో:** న్యూఢిల్లీ శ్రమశక్తిభవన్‌లో సోమవారం సాయంత్రం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మో హన్ నాయుడు,కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ,ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ఇతర ఎంపీలతో కలిసి జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో సమావేశమయ్యారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయటానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.అందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడించారు.

## రాజరాజేశ్వరి అమ్మవారి హుండీ సొమ్ము చోరి



**ద్వారకాతిరుమల, మేజర్ న్యూస్:** గ్రామంలోని ఆల్వార్ సదనం ఎదురుగా ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి గుడి వద్ద ఉన్న హుండీని ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు తాళాలను పగలగొట్టి నగదును దొంగలించారు. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అమ్మవారు హుండీలో ఆరు ఏడు నెలల నుంచి వచ్చిన ఆదాయం సుమారుగా 50వేల రూపాయలు ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.హుండి చోరీపై కమిటీ సభ్యులు సోమవారం ఉదయం ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసి గుడి ఆవరణ పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

## గోదావరి ఏటి గట్టు గురించి ఆందోళన వద్దు

**- ఎమ్మెల్యే నాయకర్**



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** పట్టణంలో గల పంటి రేవు పొన్నపల్లి వద్ద వశిష్ట గోదావరి ఏటి గట్టును శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ఎవరు అధైర్య పడవద్దు ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం,అనిప్రజలకు ధైర్యం చెప్పారు.ఏటిగట్టు పొడవునానడిచి,గట్టును పరిశీలిస్తూ, గట్టు నాణ్యత పై సందేహాలను ఏటిగట్టు పరిరక్షణ శాఖ అదుకారులను అడిగి తెలుసుకున్నారు. పంటి రేవు, బుడ్డిగ వారి రేవు లను పరిశీలంచి, ఇటీవల కాలంలో జరిగిన ఏటిగట్టు పనులను పరిశీలించారు. గోదావరి నీటి ప్రవాహాన్ని చూసి వరద ప్రభావం పై అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మీడియాతో మాట్లాడుతూ, అధిక వర్షాల వలన ఎగువ నుండి నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందువలన గోదావరికి వరద వచ్చే సూచనలు ఉన్నాయని, కావున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, దొండపాటి స్వాములు,బొమ్మిడిసూర్యకుమారి,తోట అరుణ,కొప్పాడ కృష్ణవేణి, పోలిశెట్టి సాంబ, తిరుమాని వెంకటరాజు, కొణిదెల శ్రీనివాస్, వట్టిప్రోలు సతీష్, శ్రీరామ్, బొమ్మిడి కృష్ణమూర్తి, అంబటి అరుణ, శశిదేవి,కొప్పాడ కనకరాజు,బర్రె మురళీ పాల్గొన్నారు.





# అధైర్య పడవద్దు

**-పునరావాస సేవలు అందుతున్నాయా ?**
**- బోటులో వెళ్లి ప్రజలను కలుసుకుని, సుడిగాలి పర్యటన చేసిన కలెక్టర్,ఎస్పీ**

**వేలేరుపాడు,మేజర్‌న్యూస్ :**పునరావాస కేంద్రాలలో వరద బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సేవలందించాలని అధికారులను కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. వరద కారణంగా ముంపునకు గురైన కుక్కునూరు, వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాలలో సోమవారం కలెక్టర్, ఎస్పీ సుడిగాలి పర్యటన చేశారు. వరద నీటిలో మునిగి రహదారి మార్గాలు దెబ్బతిన్న వేలేరుపాడు మండలం తిరుమలాపురం,నార్లవరం గ్రామాల ప్రజలను కలిసేందుకు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిశోర్ తో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి బోట్ ద్వారా వరద ముంపు గ్రామాల ప్రజలను కలిశారు.

ఒకొక్క కుటుంబానికి 3రోజులకు సరిపడా బియ్యం, కందిపప్పు,వంటనూనె,5రకాల కూరగాయలు, నిత్యావసర సరుకులను, ప్రతీ ఇంటికి వాటర్ పాకెట్స్ ఒక బస్తా చొప్పున ఇంటింటికి సిబ్బంది అందిస్తున్నారని, ప్రజలకు సక్రమంగాఅందుతున్నాయా? అని ప్రజలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అధైర్యపడొద్దని, బాధితులకు ఎటువంటి నష్టంకలగకుండాజిల్లాయంత్రాంగం మీ వెనుక ఉంటుందని బాధితులలో కలెక్టర్ భరోసా నింపారు.

అనంతరం దాచారం ఆర్అండ్ఆర్ కాలనీకి చేరుకొని అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసరసరుకులు,త్రాగునీరు అందుతున్నదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కష్ట సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని,వారిలోధైర్యంనింపాలనికలెక్టర్ అధికారుల కు ఆదేశాలు జారీ చేశారు.

అనంతరం కుక్కునూరు చేరుకొని వరద పునరావాస కేంద్రంలో బాధితులకు అందుతున్న సేవలను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట ఐటిడిఏప్రాజెక్ట్అధికారి ఎం.సూర్యతేజ,డిఆర్డిఏ పీడీ ఆర్. విజయరాజు,డిపిఓతూతిక శ్రీనివాస్ విశ్వనాధ్,డీఎస్ ఓఆర్.సత్యనాం యణ రాజు,జిల్లాపౌరసరఫరాల సంస్థ డిఎం మంజుభార్గవి, తహసీల్దార్ చిన్నారావు, ప్రభృతులు పాల్గొన్నారు.

## వరద ప్రమాదం ముగిసే వరకు అప్రమత్తత

**- అల్పాహారం, భోజనం, వైద్య శిబిరాలు పటిష్టంగా నిర్వహించాలి**



**నూజివీడు,మేజర్‌న్యూస్:** గోదావరి ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కారణంగా వరద ఉధృతి పెరుగుతున్నందున సహాయ పునరావాస కార్య క్రమాల అమల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి అధికారులను ఆదేశించారు. సోమవారం గోదావరి వరద ఉధృతి పరిస్థితిపై ఉన్నతాధి.కారులతో ఫోన్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావాస కేంద్రానికి వచ్చిన ఏ ఒక్కరూ ఇబ్బందులకు గురకాకుండా వారికి వసతి ఏర్పాటుతోపాటు అల్పాహారం, టీ, భోజన సౌకర్యం, వైద్య సహాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. 12 పునరావాస కేంద్రాల్లో సుమారు 6వేల మంది బాధితులకు ఆశ్రయం కల్పించడం జరిగిందన్నారు. కుక్కునూరు మండలంలో 2 వేలు, వేలేరుపాడు మండలంలో 4వేల మందికి పునరావాసం కల్పించడం జరిగిందన్నారు.
నిత్యావసర వస్తువులతోపాటు 15 వేల టన్నుల కాయగూరలు పునరావాస కేంద్రాలకు సరఫరాకోసం అందుబాటులో ఉంచడం జరిగిందని మంత్రి వివరించారు.

## గండిపడిన ప్రాంతంలో జిల్లా కలెక్టర్ పర్యటన





**- ఎస్‌టి కాలనీ వాసులకు భోజనం, మంచినీళ్ళు అందించేందుకు చర్యలు**

**భీమవరం,మేజర్‌న్యూస్:** గోస్తని నదికి గండిపడి ముంపుకుగురైన గుత్తులవారి పాలెం ఎస్టీ కాలనీలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి కాలనీ వాసులకు ధైర్యం చెప్పారు. ఆదివారం రాత్రి గోస్తని నదికి గండి పడిందని తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హుటాహుటిన పాలకోడేరు మండలం మోగల్లు గ్రామం గుత్తులవారి గ్రామానికి చేరుకుని గండి పడిన ప్రాంతాన్ని కట్టడి చేసేందుకు యుద్ధ ప్రాతిపదిక అధికారులను ఆదేశిస్తూ పర్యవేక్షించారు. సోమవారం గుత్తుల వారి పాలెం ఎస్టి కాలనీలో ఉన్న ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ నీకు ఆధార్ కార్డులు ఉన్నాయా, రేషన్ అందుతుందా,ఎవరికైనా అనారోగ్యం ఉందా,మీ మగ వారు ఏం చేస్తారు, మీరు ఏం చేస్తారు అనిఆరాతీశారు. కాలనీ వాసులు బదులిస్తూ ఆధార్, రేషన్ కార్డులు ఉన్నాయని బదులిచ్చారు. మగవారు చేపలు పడతారని,మేము చేపలు అమ్ముతామని తెలిపారు. త్రాగునీటికి ఇబ్బందిగా ఉందని, డ్రైనేజీ లేక ఇబ్బంది పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు.పిల్లలు బాగా చదువుకుంటున్నారా, స్కూలుకు వెళ్తున్నారా అని పిల్లలని ప్రశ్నించారు. బాగా చదువుకోవాలని తెలిపారు. నివాస ప్రాంతాల వరకు నీరు రావడం వలన పాములు, తేళ్లు వచ్చే అవకాశం ఉందని, పాముకాటుకు అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శ్రీనివాసులు రాజు,పాలకోడేరు ఎంపీడీవో అనూహ్య, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎం, తదితరులు ఉన్నారు.

## దాచారంలో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన బాధితులు

**- అధికారులు కంటికి రెప్పలా చూసుకుంటున్నారు**
**- రాత్రి 12 గంటల వరకు మమ్మల్ని అంటి పెట్టుకునే ఉంటున్నారని వెల్లడి**
**- పునరావాస కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ**



**కుక్కునూరు,మేజర్ న్యూస్ :** కుక్కునూరు మండలం గొమ్ముగూడెంకు చెందిన వరద బాధితులకు ఏర్పాటు చేసిన దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలోని పునరావాస కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి,జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్,ఐటిడిఎపివో యం.సూర్య తేజలతో కలిసి సందర్శించారు. ఈ సమయంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పునరావాస కేంద్రంలో సదుపాయాలపై అక్కడవున్న వారిని ఆరా తీసిన సమయంలో గొమ్ముగూడెంకు చెందిన సీనియర్ సిటిజన్ డి.సత్యం పునరావాస కేంద్రంలో సదుపాయాలు బాగున్నా యని,మీరు నియమించిన అధికారులు తమను కంటికి రెప్పలా చూసుకుంటున్నా రని కలెక్టర్‌కు తెలిపారు.

1986లో గోదావరి వరదల సమయంలో మీరు ఉన్నారా అని కలెక్టర్ ప్రశ్నించగా అప్పటినుండి ఇక్కడే ఉన్నామని తెలపగా గోదావరి వరదలకు సంబంధించి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కోటగిరి నవీన్ మాట్లాడుతూగోదావరి వరద హెచ్చరికల ముందునుంచే అధికారులనంతా అప్రమత్తం చేయడం ఎంతో ఉపయోగపడిందని చెప్పారు. త్రాగునీటి గానీ ఇతర సదుపాయాల విషయంలోగాని అధికారు లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. రాత్రి 12 గంటల వరకు తమను అంటిపెట్టుకునే ఉంటున్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అధికారుల నుంచి ఇంకా సహకారమవసరమైతే అందిస్తామని అదే విధంగా మీగ్రామాల్లో ఇంకా ఎవరైనా పునరావాస కేంద్రానికి రానివారుంటే వారిని కూడా తీసుకురావాలని సూచించారు. గ్రామంలో పశువులను కూడా తీసుకువస్తే వాటికి అవసరమైన దాణా,త్రాగునీరు సౌకర్యాన్ని అధికారులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా బెస్తగూడెంకు చెందిన బి.కృష్ణార్జునరావు మాట్లాడుతూ పునరావాస కేంద్రంలో ఏర్పాట్లు అన్నీ బాగున్నాయని పేర్కొన్నారు.

## రైతులకు విత్తనాలు,ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వాలి

**- మాజీ డిప్యూటీ సీఎం కొట్టు డిమాండ్**



**పెంటపాడు,మేజర్ న్యూస్:** భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతాంగానికి ఇన్పుట్ సబ్సిడీ, విత్తనాలు తక్షణమే ప్రభుత్వం ఇవ్వాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పెంటపాడు మండలంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించారు. నీట మునిగిన వరి పొలాలను, వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్ర కాలవ, వయ్యేరు యనమదుర్రు కాలవలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పెంటపాడు మండలంలోని గ్రామాలైన దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల, రావిపాడు, బి.కొండేపాడు, మీనవల్లూరు, రామచంద్రపురం, ఆకుతీగపాడు, పరిమళ్ళ, యానాలపల్లి గ్రామాలలో మాజీ మంత్రి కొట్టు పర్యటన సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరానికి 15 నుంచి 20 వేల రూపాయల వరకు రైతులు పెట్టుబడి పెట్టి ఉన్నారన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరానికి 20 వేల రూపాయలు రైతు భరోసా ఇస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. దాళ్వా ధాన్యం బకాయిలు నేటికీ పూర్తిగా చెల్లించకపోవడం దారుణమని ఖండించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రైతుల పక్షాన పోరాడుతామని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టు సత్యనారాయణ హెచ్చరించారు. ఈ పర్యటనలో వైయస్సార్సీపి నాయకులు కైగాల శ్రీనివాసరావు, గుండుమోగుల సాంబయ్య, ముప్పిడి సంపత్ కుమార్, చెన్న జనార్దన్ రావు,కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు,బోనం వీరయ్య, బండారు నాగు,రెడ్డి సూరిబాబు,బొద్దాని శ్రీనివాస్, రావిపాడు సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, దేవా వెంకటరమణ, కైగాల గణపతి, బి.కొండేపాడు ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ గణపతి, తదితరులు పాల్గొన్నారు.

## వరద ప్రాంతాల్లో జెసి సుడిగాలి పర్యటన





**- పునరావాస కేంద్రాలు,వైద్య శిబిరాలు పరిశీలన**

**కుక్కునూరు/వేలేరుపాడు,మేజర్ న్యూస్ :** గోదావరి వరద బాధితులకు అన్ని విధాల అండగా ప్రభుత్వం ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితెలిపారు.సోమవారంకుక్కునూరు,వేలేరుపాడు మండలాల్లోని పలు ప్రాంతాల్లో జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి పర్యటించారు. లచ్చిగూడెంగ్రామప్రజలతో జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి మాట్లాడుతూ పునరావాస శిబిరానికిరావాలని,గొమ్ముగూడెంగ్రామ ప్రజలకు దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీ 1, రేపాకగొమ్ము గ్రామ ప్రజలకు దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీ సి బ్లాక్ నందు పునరావాసం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.గొమ్ముగూడెంకుసంబంధించి170 కుటుంబాలు చెందిన 520మంది జనాభా ఉన్నారన్నారు. రేపాకగొమ్ము చెందిన 148 కుటుంబాలకుచెందిన 461 మంది ప్రజలు ఉన్నారన్నారు.అదే విధంగా కౌండిన్యముక్తి చెందినవారిని మర్రిపాడుఆర్‌అండ్ఆర్‌కాలనీ పునరావాస కేంద్రానికి తరలించడం జరుగుతుందన్నారు. ఇక్కడ 35 కటుంబాలకు చెందిన 118 మంది జనాభా ఉన్నారన్నారు. వంటకు వినియోగిస్తున్న దినుసుల నాణ్యతను పరిశీలించారు. వీ వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.బాబ్జి, కె.భాస్కర్ ఉన్నారు.

**-వైద్యశిబిరాన్ని సందర్శించిన జేసి లావణ్యవేణి**-గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో మెరుగైన వైద్యాన్ని అందుబాటులో ఉంచేందుకు పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయటం జరిగిందని జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి తెలిపారు. దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలోని పునరావాస కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సోమవారంఆమెసందర్శించారు. వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను ఆరా తీస్తూ అక్కడ ఉన్న మందులను పరిశీలించారు.



## వరద విపత్తులో సురక్షిత ప్రసవం

**కుక్కునూరు,మేజర్ న్యూస్ :** భారీ వర్షాలు వరదల కారణంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశాల ప్రకారం కుక్కునూరు వేలేరుపాడు మండలాల్లో 28 మంది గర్భిణీలు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో, సమీప పిహెచ్ సిలో చేర్పించారు. ఈ నేపధ్యంలో ఈనెల 21వ తేదీన కుక్కునూరు మండలం చీపురుగూడెంకు చెందిన సోదేం అనిత పుల్లపగూడెంకు చెందిన బి.అరుణ,ఈనెల 22వ తేదీన చీపురుగూడెంకు చెందిన మడకం దేవమ్మ పండంటి బిడ్డలకు జన్మనిచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో గర్భిణీలను గుర్తించి వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించడంలో జిల్లా యంత్రాంగం తీసుకొన్న చర్యలపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## తాడేపల్లిగూడెంను అగ్రస్థానంలో నిలిపేందుకు సహకరించాలి

**- వైద్యుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి**



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** తాడేపల్లిగూడెం పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ నందు వైద్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలపడానికి వైద్యులు సహకరించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి మినహా ఒక్క రూపాయి అడగననీ గూడెంను సుందరంగా తీర్చి దిద్దేందుకు కృషిచేస్తానన్నారు. తాడేపల్లిగూడెంలో లక్షలాది రూపాయలు వసూలు చేసే వైద్యులు లేరని పేర్కొన్నారు. 70- 80 లక్షల రూపాయలతో వైద్యులు ఇండోర్ స్టేడియం నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. తాను మున్సిపల్ చైర్మన్గా ఉన్నప్పుడు తాడేపల్లిగూడెంలో స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ పార్క్ వంటి వాటిని నిర్మించడం జరిగిందనీ తన సొంత నిధులు కోటిన్నర నిధులతో అభివృద్ధి చేశానన్నారు. అయితే ఏనాడు తాను చెప్పుకోలేదనీ ఒక్క రూపాయి ఎవర్ని ఆశించలేదని స్పష్టం చేశారు. నియోజవర్గ అభివృద్ధి కొరకు ఏదైనా అడుగుతానని మనం చనిపోయిన తర్వాత మంచి, చెడులు మాత్రమే వెంట తీసుకెళ్తామన్నారు. వచ్చే రోజుల్లో గోదావరి ఏలూరు కాలువ గట్టు పరిరక్షణలో భాగంగా తాడేపల్లిగూడెం ఖ్యాతిని ఇనుమడింప జేసిన కోడె వెంకట్రావు, రేలంగి వెంకట రామయ్య, డాక్టర్ పిఎల్ వి ప్రసాద్ వంటి మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎం ఏ వైద్యులు పాల్గొన్నారు.

సూర్య
పశ్చిమ గోదావరి
మంగళవారం, 23 జూలై 2024


# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



**పెదవేగి,మేజర్ న్యూస్:** ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి మాత్రమే నడచుకోవాలని, అలాకాకుండా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ విరాజేంద్రప్రసాద్ రౌడీషీటర్లను హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలను అనుసరించి,డీఎస్పీ జి.లక్ష్మయ్య సూచనలతో, సీఐ కె.శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పలువురు రౌడీషీటర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రౌడీషీట్లో వ్యక్తిలో మార్పురావాలని, అలాకాకుండా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు మరింత కఠినంగా ఉంటాయన్నారు. ప్రతి వ్యక్తికి భార్య, పిల్లలతో ఒక కుటుంబం ఉంటుం దని, వారికోసం జీవించడంలో ఆనందం ఉంటుందని చెప్పారు. కానీ కొంతమంది అందరినీ విడిచి, సమాజం మెచ్చని విదంగా, దాడులు, దౌర్జన్యాలవంటి చట్టవ్యతిరేకంగా పాల్పడుతున్నారని, అలాంటివారిని ఉపేక్షించబోమని తెలిపారు.

# డెంగ్యూ నిరోధకం పై అవగాహనా ర్యాలీ



**అగిరిపల్లి,మేజర్ న్యూస్:** పీహెచ్ సి సిబ్బంది చే సోమవారం మండల పరిధి ఈదర,ఎస్ ఎ పేట, సగ్గురు,నరసింగ పాలెం గ్రామాలలో డెంగ్యూ నిరోధకపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ డెంగ్యూ నిరోధక మాస ర్యాలీ,బృంద సమావేశంలో డాక్టర్ నాగ జోష్న సహకారంతో సందర్శించి,సిబ్బందికి,ప్రజలకు డెంగ్యూ ఫీవర్,లార్వాటోలను ఎలా గుర్తించి, ఎలా నివారించాలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పిహెచ్సి ఈదర,డాక్టర్, మంజుల దేవి,నూజివీడు ఎస్యూవో డా'యలమందయ్య,డాక్టర్, సంధ్య ప్రియ, పిహెచ్సి సగ్గురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– అధికారులు క్షేత్రస్థాయిలోనే మకాం ఉన్నారు – ధైర్యంగా ఉండండి**



**యలమంచిలి,మేజర్ న్యూస్ :** మండలంలోని కనకాయలంకలో నీట మునిగిన కాజ్ వే వరద ఉధృతిని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య సోమవారం పరిశీలించి,ప్రజలతో మాట్లాడి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. పెదలంక,దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడి పాలెం లక్ష్మీపాలెం, తదితర గ్రామాలను ఆర్డీవో యం. అచ్యుత అంబరీష్, మండల అధికారులతో కలిసి జిల్లా జాయింటు కలెక్టరు ప్రవీణ్ ఆదిత్య సుడిగాలి పర్యటన చేశారు. గ్రామాలలో అధికారులతో కలిసి నడుచుకుంటూ వెళ్ళి ప్రజలను కలుసుకుని ప్రస్తుత పరిస్థితులను వివరించి యోగక్షేమాలనుఅడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అధికారులు,సిబ్బంది గ్రామాల్లోనే మకాం వేశారని ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన సహాయ చర్యలు తీసుకునుటకు సంసిద్ధులుగా ఉన్నారని ప్రజలకు ఆయన తెలిపారు. వరద పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మూడు నెలలు సరిపడా బియ్యం, నిత్యవసర సరుకులు నిల్వ ఉంచడం జరిగిందన్నారు. కంట్రోల్ రూమ్ నెంబరు అందరికి తెలిసేలా చూడాలని, ఎవరికైనా ఏ సమయంలోనైనా సమస్య వచ్చినా టోల్ ఫ్రీకి ఫోన్ చేయాలని వెను వెంటనే స్పందించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అయనవెంటఆర్డీవోయం. అచ్యుత అంబరీష్, తహాశీల్దారు సి.హెచ్.విజయశ్రీ,యంపిడివో పి.శ్రీనివాస రావు, వివిధ శాఖల అధికారులు,వివిధ పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

# క్షీరారామంలో పంచ హారతులు



పాలకొల్లు,మేజర్న్యూస్: శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారం సందర్భంగా పంచ హార తలుకు శ్రీ స్వామి వారి ప్రత్యేక అలంకరణ చేశారు, పంచ హారతి కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు, భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకుని అనం తరం తీర్థప్రసాదాలను భక్తు లకు దేవస్థానం అందజేశారు, దేవ స్థానం కార్యనిర్వాహ ణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ దగ్గరుండి పర్యవేక్షించారు, వేద పండితుల చేత పూజలు గావించారు.

## రాట్నాలమ్మ ఆలయ అభివృద్ధికి రూ.1 లక్ష విరాళం

**– ఎమ్మెల్యే ప్రభాకర్ చేతులమీదుగా అందించిన భక్తులు**



**పెదవేగి,మేజర్ న్యూస్ :** కోనసీమ జిల్లా గుమ్మిలేరు గ్రామానికి చెందిన ముత్యాల వీరభాస్కరరావు, కృష్ణవేణి దంపతులు, పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందించారు. సోమవారం ఉదయం అమ్మవారిని దర్శిం చుకుని, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయ అభివృద్ధికి గానూ రూ.లక్ష విరాళాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతులమీదుగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్కుమార్కు అందించారు. ఈ కార్యక్రమంలో అలపకమిటీ మాజీ చైర్మన్ రాయల ఉమామహేశ్వరరావు, టీడీపీ నాయకులు మంచినేని శ్రీనివాసరావు. అవిర్నేని శ్రదర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్ పి డి వో కుటుంబానికి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే నాయకర్



**నర్సాపురం,మేజర్ న్యూస్:** నర్సాపురం ఎంపీడీవోగా పనిచేస్తూ సెలవుపై వెళ్లి అదృశ్యమైన ఎంవి రమణారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కలసి ధైర్యం చెప్పారు. సోమవారం కృష్ణాజిల్లాలోని ఎంపీడీవో నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా జనవరిలో ఎమ్ పి డి వొ పోస్టింగ్ జరిగిన దగ్గర నుండి అయినకు ఎవరు సపోర్ట్ లేరని, పంటి పాట పాడిన వారి దగ్గర నుండి చాల ఒత్తిడిని ఎదుర్కొన్నారని నాయకర్ ఇచ్చిన సపోర్ట్తో మీటింగ్ పెట్టి పైనా అధికారులుతో మాట్లాడారని కుటుంబసభ్యులు చెప్పారు. నాయకర్ ని కలిసిన తర్వాత అయినతో జరిగిన సంభాషణలు ఇంట్లో వారితో షేర్ చేసుకున్నారని వారి భార్య తెలిపారు. ఫోన్ కాల్స్ వల్ల ఎక్కువ ఒత్తిడికి లోనియారు అని అది కూడా ఒక వరస లో వుండటం పోలీస్ బృందాలు మారింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. నాయకర్ ఎంపీడీవో ఇంటి దగ్గర నుండి నుండి వివిధ అధికారులకు ఫోన్ చేసి వివరాల అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పొత్తూరి రామరాజు తదితరులు ఉన్నారు.

## న్యాయవాదుల సంఘం పదవులకు 28 నామినేషన్లు

**నరసాపురం,మేజర్ న్యూస్ :** ఈ నెల 31వ తేదీన జరగనున్న నరసాపురం న్యాయవాదుల సంఘం కార్యవర్గ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మొత్తం 28 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేసారని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లమిల్లి జోసెఫ్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 15 మందితో కూడిన న్యాయవాదుల సంఘం కార్యవర్గానికిగాను 28 నామినేషన్ పత్రాలు దాఖలయ్యాన్నారు. ఓఅధ్యక్ష పదవికి సి.హెచ్.ఎస్. ఆర్.ఆర్. మోహన బాలాజీ, జి.ఎం.వల్లభరావు, ఉపాధ్యక్ష పదవికి కొత్తపల్లి రమేష్, కె.సుందర మాణిక్యాలరావు, ప్రధాన కార్యదర్శి పదవికి వైదాని నాగేశ్వరరావు, రంపా పుల్లాజీ, ఆర్. గ్లాడ్ సన్ కుమార్, కోశాధికారి పదవికి పూరిళ్ళ శ్రీనివాస్, రంపా పుల్లాజీ, లైబ్రరీ కార్యదర్శి పదవికి కె.అమరేశ్వరరావు, రంపా పుల్లాజీ,నారిన శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ పదవికి కురెళ్ళ సోమశేఖర్, నారిన శ్రీనివాసరావు, క్రీడలు–సాంస్కృతిక కార్యదర్శి పదవికి మేడిది శ్రీమంత్, కె.సి.హెచ్. పద్మజ, మహిళా ప్రతినిధి పదవికి రొక్కాల జెస్సికళ, బొడ్డు ప్రగతి, కార్యవర్గ సభ్యుల పదవులకు తంగెళ్ళ వెంకటేశ్వరరావు, ఓసూరి జ్యోతి మాంగళ్య(30 సంవత్సరాల ప్రాక్టీసు), తోట రాజ్య సూర్యలక్ష్మి, కె.చంద్ర శేఖర్(20 సంవత్సరాల ప్రాక్టీసు), కుంచే దుర్గాభవాని (10సంవత్సరాల ప్రాక్టీసు) కె.అన్నపూర్ణ, కె.ఎల్.ఎస్.ఎస్.నాగ శిరీష, గోపిరెడ్డి మణి, పులపర్తి హర్షవర్ధన్, ఎం.కాశీనాథ్లు నామినేషన్ పత్రాలను దాఖలు చేసారని ఆయన వివరించారు. అభ్యర్థులు ఈ నెల24, 25 వ తేదీలో తమ నామినేషన్ లను ఉపసంహరించుకోవడానికి గడువు ఉందని ఎన్నికలను ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తామని జోసెఫ్ తెలిపారు.

# వరద ముంపు ప్రాంతాల్లో కిసాన్ మోర్చా రాష్ట్ర నేతల పర్యటన



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** వరద ముంపు ప్రాంతాలను బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట గంగరాజు ఎస్ ఇల్లిందలపర్రు గ్రామంలో సందర్శించారు, రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకోన్నారు. గోస్తనీ నది పూడికపై గత ప్రభుత్వాల్లో జరిగిన అక్రమాల గురించి రైతులు చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి ఎమ్మెల్యే దృష్టికి ఎంపి దృష్టికి తీసుకొని వెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని బిజెపి పార్టీ తరపున కూటమి తరుపున రైతులకు మాట ఇవ్వడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పులపర్తి నాగరాజు,అత్తిలి మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు సరగడం శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శి మారుతీ కృష్ణ, పెనుమంట్ర మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు కర్రి సూర్ రెడ్డి, యువమోర్చా మండల అధ్యక్షుడు కర్రి బ్రహ్మానంద రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రీ కృష్ణారెడ్డి, జనసేన తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపిని బలోపేతం చేయాలి - సర్వసభ్య సమావేశంలో నేతలు



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** అల్లూరి ట్రస్ట్ భవన్ నందు జిల్లా భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు నరసాపురం పట్టణ స్థాయి బీజేపీ సర్వసభ్య సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మునుకోటి వెంకటేశ్వర్ రావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు నార్ని తాతాజీ,నరసాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి రవికుమార్ లు హాజరయ్యారు. జిల్లా కార్యదర్శులు గునిశెట్టి శ్రీనివాస్ ,గుడాల ఈశ్వరచంద్ర మెరుగుమోవ్వల దిలీప్ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ కొప్పర్తి వెంకట్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మోచర్ల శిరీష , జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కంచర్ల నాగేశ్వరావు,జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి మోరంపూడి రాము, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి బర్రె సురేష్ ,భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ వైద్యులు ఇలపకుర్తి ప్రకాష్,ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు వనమాల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ఘనవిజయం సాధించిన సందర్భంగా ఈ విజయానికి కృషిచేసిన కార్యకర్తలు అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని వివిధ వార్డుల నుండి వచ్చిన సుమారు 30 మంది తటస్థులైన భారతీయ జనతా పార్టీ అభిమానులు జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ ,పట్టణ అధ్యక్షులు మునుకోటి వెంకటేశ్వ రావు సమక్షంలో పార్టీలో చేరారు. పట్టణానికి చెందిన సహస్ర శతావధాని కడిమెళ్ళ వరప్రసాద్ని ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు నారిని తాతాజీ,జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి రవిని పట్టణ భారతీయ జనతా పార్టీ ఘనంగా సత్కరించింది. తల్లికి వందనం" కార్యక్రమంలో భాగంగా అల్లూరి సాంస్కృతిక కేంద్రం వద్ద మొక్కలు నాటారు.

## విద్యుత్ మీటర్ రీడర్లకు న్యాయం చేయాలి



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్ల పశ్చిమగోదావరి జిల్లా సమావేశం కే శివారెడ్డి అధ్యక్షతన స్థానిక స్ఫూర్తి భవనంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మీటర్ రీడర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ గత వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మీటర్ రీడర్లకు చాలా అన్యాయానికి గురి చేసిందన్నారు. టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం మీటర్ రీడర్లకు న్యాయం చేయాలనీ కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలో మీటర్ రీడర్స్కు పిస్ రేట్ సక్రమంగా కాంట్రాక్టర్లు చెలించటలేదని యాజమాన్యానికి ఎన్ని సారులు చెప్పిన పట్టించుకోలేదని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి శ్రీనివాస్ డాంగే,ఏలూరు జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మేటర్ రిడర్స్ సంఘానికి నూతన కమిటీనీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఓ.శ్రీనివాస్ కార్యదర్శిగా జి.దుర్గ రావు,కోశాధికారి గా కె.మల్లేశ్వరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పవన్ , డివిజన్ నాయుకులు,మీటర్ రీడర్లు పాల్గొన్నారు

# నర్సాపురంలో గోదావరి ఉధృతిని పరిశీలించిన ఆర్డీవో



**నరసాపురం,మేజర్ న్యూస్ :** వశిష్ఠ గోదావరి ఉధృతిని ఆర్డీవో అచ్యుత అంబరీష్ సోమవారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పొన్నపల్లి 1,2,3 వార్డులు పరిశీలించి అక్కడ ఉన్న ప్రజలుతో మాట్లాడి ఆర్డీవో ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్ష ప్రభావం తగ్గినను, ఎగువన కురిసిన వర్షాలు వరద రూపంలో మనకు ప్రమాదం వచ్చే అవకాశం ఉన్నందున, తీర ప్రాంతాలను, గోదావరి పరివాహక ప్రాంతాలను అప్రమత్తం చేశామని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, ఆచంట మండలాల్లో తుఫాన్ రక్షిత భవనాలను సిద్ధం చేశామన్నారు. వరద పరిస్థితి మరింత ఎక్కువ అయితే పునరావాస కేంద్రాలకు వచ్చుటకు సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తీరప్రాంతంలో బోట్స్ మెన్స్ సొసైటీలను, మత్స్య కారులను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. వారి పడవలు, వలలు, ఇతర పనిముట్లను భద్రపరుచు కునేలా,ఎవరూ చేపల వేటకు వెళ్ళకుండా చూడాలని సూచించామన్నారు. అనధికార పడవలు, గోదావరిలోకి వెళ్ళనియ్య వద్దని, వేట బోట్లను సముద్రంలోకి వెళ్లకుండా చూడాలని మత్స్య శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఆర్డీవో వెంట తహశీల్దారు యన్.యస్ యస్.ప్రసాదు, రెవిన్యూ ఇన్స్పెక్టరుకె.యశోద,రెవిన్యూసిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ హెల్త్లో 9 మంది ఉద్యోగులకు పదోన్నతి వేతనాలివ్వాలి




**ఏలూరు,మేజర్ న్యూస్:** నగరపాలక సంస్థలో పని చేస్తున్న పబ్లిక్ హెల్త్ లోని 8 మందికి ఇంజన్ సెక్షన్ మజ్దూర్ ఒకరికి మొత్తం 9 మందికి 2022 మార్చి 30 హెవీ వెహికల్స్ డ్రైవర్స్ గా పదోన్నతి నగరపాలక సంస్థ మేయర్ ఉత్తర్వులు ఇచ్చారు. కాని అమలు చెయ్యలేదని,గత రెండు సంవత్సరాల నాలుగు మాసాలుగా పదోన్నతి పొందిన డ్రైవర్ పదోన్నతి వేతనం కానీ ఇంక్రిమెంట్లు హదాక్ ఇంక్రిమెంట్లు ఇవ్వటం లేదని ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వర రావు ఆరోపించారు. తక్షణమే డ్రైవర్లకు పెరిగిన వేతనాలు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరుతూ నగరపాలక సంస్థ కార్యాలయ వేదిక ఏఐటీయూసీ అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేసి అడిషనల్ కమిషనర్కి వినతి పత్రం ఇచ్చినట్టు తెపారు. ఈ కార్యక్రమంలో జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ అప్పలరాజు, యూనియన్ నాయకులు బి.నాగేశ్వరరావు ఎస్ శ్రీనివాస్ ఎస్ ఎం వి సుబ్బారావు డ్రైవర్లు మెరుగు గోవిందు గోరాకుల దుర్గారావు గాడి అప్పారావు అంతర్వేది శేఖర్ కునుగుపాటి ప్రసాదు తాడేపల్లి శేఖర్ ఏబి ఆంథోని పాల్ దనికొండ అప్పారావు పంతం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్గా రెవ.డేవిడ్ రాజు



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** పెనుమంట్ర మండలం యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్గా రెవ.కొమ్మర డేవిడ్ రాజునీ ఎన్నుకున్న సందర్భంగా ఆలమూరు ఫెయిత్ హోమ్ చర్చ్ సంఘ సభ్యులు ఘనంగా సన్మానం చేశారు. ఫెయిత్ హోమ్ చర్చ్ సేవకురాలు,కొమ్మర విజయకు మారి కన్వీనర్ కొమ్మర సుజిత్, అధ్యక్షతన సంఘ పెద్దలు కర్రి నాగిరెడ్డి, గుడిమెట్ల భాస్కరరెడ్డి, గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి, స్త్రీల సమాజము వారు సత్తి సుగుణమ్మ, చిత్రాడ నాగమణి కాలా కృష్ణవేణి జుట్టిగా ధనలక్ష్మి, నల్లకుల లక్ష్మి, ఆచంట లక్ష్మి,బడితల సుబ్బలక్ష్మి , యూత్ వారు పంపన సాయి, సనాయిల తేజ పోలిశెట్టి రాజు, నల్లాకుల పావని, మాధురి, బడితాల కరుణ, సనాయిల భవాని విశ్వాసులు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భద్రాచలం నీటి మట్టం పెరుగుదల హెచ్చరికలు జారీ

**– గోదావరి పరివాహక ప్రాంతంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి**



**భీమవరం, మేజర్ న్యూస్:** గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై గోదావరి వరద పరిస్థితి పై సమీక్షించారు. భద్రాచలం నుండి దిగువకు వదులుతున్న వరద నీటితో వశిష్ట గోదావరి నీటిమట్టం గంట గంటకు పెరుగుచున్నదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్యం,ఫైర్ తదితర శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో ముందస్తు చర్యలను యుద్ధ ప్రాతిపతిపదికన పూర్తి చేయాలన్నారు. ప్రాణ, ఆస్తి, జంతు నష్టాలు ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదని ఆదేశించారు. జల వనరుల శాఖ అధికారులు గోదావరి వరద పోటు సాధారణ స్థాయికి వచ్చేవరకు నిరంతర పర్యవేక్షణ, ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ వైర్లు వేలాడడం కారణంగా ఒక్క ప్రాణికి హాని కలిగినా ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, సంబంధిత అధికారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జె.ఉదయభాస్కరరావు, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి శివన్నారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ ఈఈ దక్షిణామూర్తి, విద్యుత్ శాఖఈఈ పి.అహ్మద్ ఖాన్,పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు ఆహార పదార్థాలు అందజేసిన వాసవి క్లబ్



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ తాడేపల్లిగూడెం వాసవి క్లబ్ వారి ఈరోజు తాడేపల్లిగూడెం మండలం జగన్నాధపురం గ్రామ శివారు ప్రాంతంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిరాశ్రయులైన వారికి బట్టలు ఆహార పానీయాలు అందజేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల యందు పునరావాస కేంద్రం ఏర్పాటు చేయడంతో అక్కడ తలదాచుకుంటున్న వారికి చాప్టర్ ప్రెసిడెంట్ పులవర్తి పవన్, వాసవి క్లబ్ అధ్యక్షులు నన్న ఆనంద్, కార్యదర్శి సిహెచ్ఆర్ గుప్తా, కోశాధికారి రంగా నిరాశ్రయులకు కావలసిన బట్టలు భోజనాలు ఏర్పాటు చేశారు. వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు చీమకుర్తి రాజశేఖర్ తెలుగు పచ్చళ్లను నిరాశ్రయులకు అందజేశారు. ఈకార్యక్రమంలో వాసవి క్లబ్మాజీఅధ్యక్షులు నన్నా బాల త్రిపుర సుందరరావు,బద్రి నారాయణ పలువురు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్ పోటిల్లో హీల్ అంధ పాఠశాల విద్యార్థులకు పతకాలు



**అగిరిపల్లి,మేజర్న్యూస్ :** కర్ణాటక రాష్ట్రరాజధాని బెంగళూరు శ్రీ కంఠిరవ స్టేడియంలో ఈనెల 15 నుండి 17వరకుజరిగిన13వ జాతీయ జూనియర్,సబ్ జూనియర్ పారాఅథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని తోటపల్లి గ్రామలో గలహీల్ పారడైజ్ అంధ పాఠశాలకు చెందిన జాలా వరలక్ష్మికి లాంగ్జంప్ విభాగంలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం–రజిత పతకం లభించిందని, 1500మీటర్ల పరుగు పందెంలో కె.సునీల్ తృతీయ స్థానం సాధించికాంశ్య పతకం పొందగా,సి.హెచ్.ప్రవీణ్ 5వ స్థానంలో నిలిచాడని హీల్సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా.కోనేరు సత్యప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సత్య ప్రసాద్ మాట్లాడుతూసాధారణ విద్య,కంప్యూటర్విద్య,బ్రెయిలీ లిపి,సంగీతంతో పాటు క్రీడారంగంలోకూడా అంధ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో హీల్ఇండియా అధ్యక్షులు రామావతార్ యాదవ్ (ఎపి మాజీ డి.జి.పి) కార్యదర్శి తాతినేని లక్ష్మి, సి.ఈ.ఓ. కూరపాటి అజయ్ కుమార్, ప్రిన్సిపాల్ బి. సాయి బాబు, అంధ పాఠశాల చీఫ్ ఇన్స్ట్రక్టర్ సుఖవాసి. రుష్మంత్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు ఎస్.నాగరాజు, సి.హెచ్. ప్రభు దాస్, అథ్లెటిక్స్ కోచ్ ఏ. శ్రీనివాసరెడ్డి, ట్రైనర్ కె.నాంచారమ్మ, ఆడిటర్ జి. రాజశేఖర్,అకాడమిక్ ఇంచార్జ్ ఎం.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారపు పేటలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**ఏలూరు,మేజర్న్యూస్:** స్థానిక ఆదివారపు పేటలో షిరిడి సాయిబాబా మందిరంలో ఇసుకపల్లి తాతారావు ఆధ్వర్యంలో బాబా వారికి విశేష అలంకరణ చేశారు. నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు మందిరానికి విచ్చేసిబాబావారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అంబిక రాజా బాబా వారికి నీరాజనా మంత్రపుష్పాలు సమర్పించారు. పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ బావ విజయేంద్ర,డాక్టర్ పాల్,విజయ ప్రసాద్ సుమారు 3వేల మంది భక్తులకు అన్నసంతర్పణ ప్రారంభించారు. సాయంత్రం ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి)బాబా మందిరం సందర్శించి విశేష పూజలు జరిపించి బాబా వారి రథోత్సవం ప్రారంభించారు.

అర్చకులు గంగాధర్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్న వారి గోత్రనామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించారు.